
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు

జిల్లా వార్తలు

ఆదివారం 21 జూలై 2024

జీసీసీ ఎండీగా కల్పనాకుమారి



విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా ఉన్న గిరిజన సహకార సంస్థ (జీసీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా కల్పనాకుమారిని ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఉన్న ఎండీ సురేష్‌కుమార్‌ను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. 2019 బ్యాచ్‌కు చెందిన కల్పనాకుమారి 2021లో విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్-2 (హౌసింగ్)గా పనిచేశారు. జిల్లాల విభజన తరువాత అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. అనంతరం పార్వతీపురం మన్యం జిల్లా ... మిగతా 8వ పేజీలో



పాడేరు మండలం రాయిగెడ్డ కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వర్షం నీరు



కొయ్యూరు మండలం పెద మాకవరం- నల్లగొండ మధ్య కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

ముంచెత్తిన వాన

గెడ్డలు, రిజర్వాయర్లు, జలపాతాలు కళ కళ

- ఉధృతంగా వాగులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
- పాడేరు ఘాట్‌లో చెట్టు కూలి రాకపోకలకు అంతరాయం
- బోసిపోయిన ముంచంగిపుట్టు, హుకుంపేట సంతలు

పాడేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో శుక్రవారం రాత్రంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పాడేరు మన్యంలో గెడ్డలు, వాగులు వంకలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. గురువారం ఒక మోస్తరుగా కురిసిన వాన.. శుక్రవారం రాత్రి ఉగ్రరూపం దాల్చింది. దీంతో శనివారం ఉదయం వరకు నిరాటంకంగా వర్షం కురిసింది. అలాగే శనివారం సైతం వర్షం పూర్తిగా ఆగలేదు. దీంతో పాడేరు మండలంలోని మత్స్యగెడ్డ, రాయిగెడ్డ, చిలకలమామిడి గెడ్డ, పాడేరు, పెదబయలు మండలాలకు సరిహద్దున ఉన్న పరదానిపుట్టు గెడ్డ, జి.మాడుగుల మండలంలోని కోడిమామిడి గెడ్డ, మత్స్యగెడ్డ, ముంచంగిపుట్టు మండలంలో బూసిపుట్టు, లక్ష్మీపురం, రంగబయలు ప్రాంతాల్లోని గెడ్డలు, డుంబ్రిగుడలోని చాపరాయిగెడ్డ, సంపంగిగెడ్డ, లోచలి గెడ్డ వరద నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో ఆయా గెడ్డలకు అవతల ఉన్న గిరిజనులు గ్రామాలకే పరిమితమయ్యారు. వర్షాలతో శనివారం హుకుంపేట, ముంచంగిపుట్టు వారపు సంతలు బోసిపోయాయి. పాడేరు మండలం రాయిగెడ్డ కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహించడంతో గిరిజనుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే ఘాట్‌లోని 12వమైలు గ్రామానికి సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే హుకుంపేట మండలం శోభకోట ప్రాథమిక పాఠశాల ఆవరణలో చెట్టు కూలింది. అయితే ప్రస్తుతం వరదల నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పాటు రెండు పాఠశాల భవనాల మధ్యలో చెట్టుకూలడంతో ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. అధికార యంత్రాంగం ముంపు ప్రాంత ప్రజల్ని అప్రమత్తం చేయడంతో ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించలేదు.

పంట పొలాలను ముంచిన వరద నీరు

ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న ప్రస్తుత తరుణంలో భారీ వర్షాలు కురవడంతో వాన నీటితో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఇప్పటికే వరి నాట్లు పూర్తికాగా, మరికొన్ని ప్రాంతాల్లో నారు మడులు సిద్ధం చేసుకోవడం, నాట్లు వేసేందుకు దమ్ము పట్టడడం వంటి పనులు చేస్తున్నాయి. ఆయా పంట పొలాల్లోకి వరద నీరు వచ్చేయడంతో ప్రస్తుతం నీటితో అవి చెరువుల్లా కన్పించినా, పంట భూముల్లో ఇసుక మేటలు వేస్తే ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుందని రైతులు అంటున్నారు. పాడేరు మండలం డి.గొందూరు, కరకపుట్టు, బొక్కెళ్లు, లాడపుట్టు, ఇరడాపల్లి, హుకుంపేట మండలం అడ్డుమండ, సన్యాసమ్మపాలెం, బర్మన్‌గూడ, పెదగరువు, కొట్నాపల్లి ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. అలాగే ఇతర మండలాల్లోని వాగులు ఉధృతంగా ప్రవహించడంతో పంట పొలాలు వరదనీటితో నిండిపోయాయి.

చింతూరులో అత్యధిక వర్షపాతం

జిల్లాలో శనివారం చింతూరు మండలంలో అత్యధికంగా 207 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. ముంచంగిపుట్టులో 122 మి.మీ, జీకేవీధిలో 113మి.మీ, పెదబయలులో 111మి.మీ, డుంబ్రిగుడలో 109మి.మీ, పాడేరులో 106 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. అలాగే వై.రామవరంలో 92.6మి.మీ, కొయ్యూరులో 80.6మి.మీ, జి.మాడుగులలో 78.6మి.మీ, అరకులోయలో 78.5మి.మీ, అనంతగిరిలో 68.8మి.మీ, హుకుంపేటలో 60మి.మీ, చింతపల్లిలో 34.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో చింతూరు, జీకే వీధి, ముంచంగిపుట్టు, పెదబయలు, పాడేరు, వై.రామవరం, కొయ్యూరు మండలాలపై అల్పపీడనం ప్రభావం అధికంగా చూపించింది.

డుంబ్రిగుడ మండలంలో కొట్టుకుపోయిన కితలంగి కాజ్‌వే





ముంచంగిపుట్టు మండలం జర్జుల పంచాయతీలో నీట మునిగిన వరి పంట పొలాలు



సీలేరు: చిత్రకొండ జంక్షన్ సమీపంలో రోడ్డుకడ్డంగా పడిన భారీ చెట్టు

పొంగుతున్న కొండ గెడ్డలు

కొయ్యూరుకు నిలిచిన రాకపోకలు

- రామరాజుపాలెం, పి.మాకవరం సమీపంలో కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెనలు
- ఆర్‌వీనగర్ వద్ద బురదలో కూరుకుపోయిన భద్రాచలం బస్సు

కొయ్యూరు/డుంబ్రిగుడ/ గూడెంకొత్తవీధి/సీలేరు, జూలై 20 : వర్షాలకు మన్యంలో జనజీవనం స్తంభించింది. కొండ వాగులు పొంగి ప్రవహిం చడంతో పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబం ధాలు తెగిపోయాయి. జాతీయ రహదారి నిర్మాణాలలో భాగంగా కొయ్యూరు మండలం రామరాజుపాలెం, పి.మాకవరం సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెనలు కొట్టుపోవడంతో 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఇదే రహదారి మీదుగా చింతపల్లి వెళ్లేందుకు అడ్డంకి ఏర్పడింది. నర్సీపట్నం నుంచి శరభన్నపాలెం శుక్రవారం రాత్రి వెళ్లిన నైట్‌హాల్ట్ బస్సు వంతెనలు కొట్టుకుపోవడంతో తిరిగి నర్సీపట్నం వెళ్లే అవకాశం లేక నడింపాలెంలో నిలిపారు. యు.చీడిపాలెం పంచాయతీ గొట్లపాడు వద్ద బండివాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో యు.చీడిపాలెం, ఉల్లిగుంట, ఎర్రగొండ, పాల సముద్రం, తీగలమెట్ట తదితర పలు గ్రామాలు, ఈదులబంద, వేమనపాలెం వద్ద బండి గెడ్డ ఉధృతికి పలకజీడి మీదుగా వెళ్లే నక్కలమెట్ట, ఈదులబంద, రేవులకోట, బంగారుబంద, తదితర మరో 20 గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. బూదరాళ్ల, మూలపేట, డౌనూరు, అంతాడ శరభన్నపాలెం, తదితర పంచాయతీలలో రహదారులు కోతకు గురయ్యాయి. తహసీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో సీతయ్య పరిస్థితిని సమీక్షస్తున్నారు. అలాగే కాకరపాడు-కొయ్యూరు మధ్య శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద వట్టిగెడ్డ పొంగి రోడ్డుపై ప్రవహిస్తుండడంతో మండల కేంద్రానికి మధ్యాహ్నం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కొయ్యూరు వచ్చిన నర్సీపట్నం, పాడేరు డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద నిలిచిపోయాయి. అంతాడ- దేకురాయిల మధ్య రోడ్డుపై కొండ చరియలు విరిగిపడడంతో 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కొట్టుకుపోయిన కితలంగి కాజ్‌వే

డుంబ్రిగుడ మండలంలోని కితలంగి కాజ్‌వే కొట్టుకుపోయింది. సంపంగి గెడ్డ, చాపరాయి, చంపాపట్టి, గోరాపూర్, కురిడి గెడ్డల ఉధృతితో గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని గుంటగన్నెల పంచాయతీ జోమంగిలో వరి పంట పొలాలు నీట మునిగాయి.

ఆరు నెలలకే కొట్టుకుపోయిన చెలకవీధి బ్రిడ్జి

గూడెంకొత్తవీధి మండలంలోని అమ్మవారి ధారకొండ మార్గం చెలకవీధి సమీప కాలువ వద్ద ఆరు నెలల క్రితం నిర్మించిన బ్రిడ్జి రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొట్టుకుపోయింది. ఇంజనీరింగ్ అధికారుల, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లనే నిర్మించిన ఆరు నెలలకు కొట్టుకుపోయిందని స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు.

రోడ్డుకడ్డంగా పడిన వృక్షాలు

సీలేరు: వర్షాలకు సీలేరు సమీపంలోని చిత్రకొండ జంక్షన్ దగ్గర శనివారం ఉదయం రెండు భారీ వృక్షాలు ప్రధాన రహదారికి అడ్డంగా పడిపోవడంతో నాలుగు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో సీలేరు నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సు, భద్రాచలం నుంచి జైపూర్ వెళ్లే బస్సు, నర్సీపట్నం నుంచి సీలేరు వచ్చే బస్సులు, లారీలు, ఇతర ... మిగతా 8వ పేజీలో

డొంకరాయి, డుడుమ జలాశయాల నీరు విడుదల

- కనువిందు చేస్తున్న కటిక, సీలేరు జలపాతాలు - 8లో

వరదలను సమర్థంగా ఎదుర్కోవాలి

- అధికారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం - 8లో
- జిల్లాలోని అధికారులతో టెలీకాన్ఫరెన్స్
- ఘాట్ మార్గాల్లో రాత్రుళ్లు వాహనాల రాకపోకలపై నిషేధం

పంట నష్టం అంచనాకు శాస్త్రవేత్తల బృందాలు

- నేటి నుంచి రెండు రోజుల పర్యటన - 8లో

భక్త జనసంద్రం



సింహగిరి ప్రదక్షిణలో భాగంగా పూలరథంను అనుసరిస్తున్న భక్త జనం

సింహగిరి ప్రదక్షిణకు లక్షలాది మంది రాక

పోటెత్తిన సింహాచలం

- ఉత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించిన దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- భక్తులకు స్వచ్ఛంద సంస్థల సేవలు



గిరి ప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త, మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు

విశాఖపట్నం, సింహాచలం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఓం నమో నారసింహ. పాహిమాం...పాహిమాం...పాహి గోవిందా...గోవింద!!. అంటూ భక్తుల నామస్మరణతో శనివారం సింహగిరి పులకించిపోయింది. గిరి ప్రదక్షిణకు తరలివచ్చిన భక్తజనంతో సింహాచలం, అడవివరం ప్రాంతం జనసంద్రమైంది. ఉదయం వేలల్లో మొదలైన భక్తుల సంఖ్య సాయంత్రానికి లక్షలకు చేరుకుంది. ప్రదక్షిణ మార్గం జన ప్రవాహంతో కిక్కిరిసింది. అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది.

వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరి చుట్టూ శనివారం లక్షలాది మంది భక్తులు ప్రదక్షిణలు చేశారు. జిల్లా కలెక్టర్, దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించిన సమయం కంటే ముందుగానే వేలాది మంది భక్తులు శనివారం ఉదయం ఎనిమిది గంటలకే సింహాచలం తొలిపావంచావద్దకు చేరుకుని కొబ్బరికాయలు కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త, మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు అధికారులు నిర్ణయిం చిన సమయానికి అంటే సాయంత్రం నాలుగు గంటలకు కొండదిగువన తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. పుష్పతేరులోని స్వామివారికి అర్చక స్వాములు పూజలు చేసి అశోక్‌గజపతిరాజుకు తీర్థ ప్రసాదాలను ఇచ్చారు. అనంతరం ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలాపనలు, పండితుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తితో కలిసి జెండాను ఊపి సింహగిరి ప్రదక్షిణకు అశోక్‌గజపతిరాజు లాంఛనంగా శ్రీకారం చుట్టారు. తేరుకు ముందుభాగాన దేవస్థానం అధికారులు ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సింహాచలం తొలి పావంచా వద్ద ప్రారంభమైన పుష్పతేరు (పూల రథం) పాత అడివివరం, హనుమంతువాక, జాతీయ రహదారి నుంచి మద్దిలపాలెం, గురుద్వారా, మురళీనగర్ కూడలి, ఎన్ఏడీ, గోపాలపట్నం బంక్, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం తొలిపావంచాకు చేరుకుంది. పూలరథాన్ని లక్షలాది మంది భక్తులు అనుసరించారు. ఉత్సవంలో పాల్గొనేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మాత్రమే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు. ముందుగా రూపొందించి ప్రణాళికల ప్రకారం దేవస్థానం అధికారులు తొలిపావంచా వద్ద ... మిగతా 8వ పేజీలో

ముగ్గురు ఐఏఎస్ అధికారుల బదిలీ

జిల్లా కొత్త జేసీగా ఎంజే.అభిషేక్ గౌడ్

- కాకినాడ మున్సిపల్ కమిషనర్‌గా భావన వశిష్ఠ
- ఏలూరు జాయింట్ కలెక్టర్‌గా పి.ధాత్రిరెడ్డి
- పల్నాడు జేసీగా సూరజ్ గనోరే ధనుంజయ్
- రంపచోడవరం ఐటీడీఏ పీవోగా కట్టా సింహాచలం
- సబ్‌కలెక్టర్‌గా ఎవరిని నియమించలేదు..



భావన వశిష్ఠ



పి.ధాత్రిరెడ్డి



ధనుంజయ్



జిల్లా కొత్త జేసీ ఎం.జే.అభిషేక్ గౌడ్

పాడేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముగ్గురు ఐఏఎస్ అధికారులకు బదిలీ అయ్యింది. స్థానిక జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న భావన వశిష్ఠ (2019బ్యాచ్)ను కాకినాడ మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. గతంలో వార్డు, గ్రామ సచివాలయ శాఖలో అడిషనల్ డైరెక్టర్ ఉన్న భావన వశిష్ఠను ఈ ఏడాది జనవరిలో స్థానిక జేసీగా నియమించారు. ఆమె స్థానంలో (2020 బ్యాచ్)కు చెందిన వార్డు, గ్రామ సచివాలయ శాఖలో అడిషన్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎంజే.అభిషేక్ గౌడ్‌ను నియమించారు. అలాగే జిల్లాలో రంపచోడవరం ఐటీడీఏ పీవోగా పనిచేస్తున్న (2019 బ్యాచ్) సూరజ్ గనోరే ధనుంజయ్‌ను పల్నాడు జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. కొత్తగా అల్లూరి జిల్లా ఏర్పడినపుడు ఆయనే ఇక్కడ తొలి జేసీగా మూడు నెలలు పని చేశారు. తర్వాత రంపచోడవరం ఐటీడీఏ పీవోగా బదిలీ అయ్యారు. అప్పటి నుంచి అయన అక్కడే పనిచేస్తున్నారు. తాజా బదిలీల్లో పల్నాడు జేసీగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న (2020 బ్యాచ్) కట్టా సింహాచలంను నియమించారు. అలాగే స్థానిక సబ్‌కలెక్టర్‌గా పని చేస్తున్న పి.ధాత్రిరెడ్డిని ఏలూరు జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె శిక్షణ పూర్తి చేసుకుని గతేడాది డిసెంబరులో స్థానిక సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఏలూరు ఎస్పీగా ఉన్న ప్రతాప్ శివ కిశోర్, ధాత్రిరెడ్డి దంపతులు కావడంతో ఆమెను తాజా బదిలీల్లో ఏలూరు జేసీగా నియమించారు. స్థానిక సబ్‌కలెక్టర్‌గా ఎవరిని ప్రభుత్వం నియమించలేదు.

జనసిరితో మురిసిన సింహగిరి

భూ ప్రదక్షిణతో సమాన ఫలితాన్ని ఇచ్చే సింహ'గిరి' ప్రదక్షిణ శనివారం అంగరంగ వైభవంగా సాగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా లక్షలాది మంది భక్తులు ఉదయం ఏడు గంటల నుంచే గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుట్టారు. ముందుగా కొండదిగువ తొలి పావంచా వద్ద సింహాద్రి అప్పన్న స్వామికి నమస్కరిస్తూ కొబ్బరికాయలు కొట్టి 32 కిలో మీటర్ల గిరి ప్రదక్షిణను కాలినడక ప్రారంభించారు. పోటెత్తిన భక్తజనంతో సింహగిరి కిక్కిరిసిపోయింది.





పుష్పరథంలోని స్వామివారికి హారతిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు



పుష్పరథం వద్ద కుటుంబ సభ్యులతో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు



కాళికాదేవి వేషధారణతో కళాకారుల ప్రదర్శన



వడివడిగా అడుగులు వేస్తూ..



సింహాచలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరింధర్ ప్రసాద్



జన సమూహంలో తప్పిపోకుండా ఇలా..



కుమార్తెను భుజంపై ఎత్తుకుని పాదయాత్ర



తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



భక్తులకు పాలు పంపిణీ చేస్తున్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

అప్పన్న మహిమాన్వితుడు



నమ్మి కొలిచే భక్తులకు సకల శుభాలను కలుగచేసే మహిమాన్వితుడు సింహాచలం అప్పన్నస్వామి. కుటుంబ సభ్యులమంతా సుఖ సంతోషాలతో జీవించాలన్న కాంక్షతో ఇరుగుపొరుగు వారి సూచనల మేరకు తొలిసారి గిరి ప్రదక్షిణకు వచ్చాను.

- కె.భారతి, గృహిణి, పార్వతీపురం

చిన్నతనం నుంచి అలవాటు



నా చిన్నతనం నుంచి గిరి ప్రదక్షిణకు రావడం అలవాటు. మా తల్లిదండ్రుల నుంచి నాకు ఇది అలవాటుగా మారింది. ఎటువంటి కోర్కెలు లేకుండా ఏటా గిరి ప్రదక్షిణ చేస్తున్నాను. ఇప్పటి వరకు 19 సార్లు రాగా, ఇది 20వ సారి.

- ఆర్. శైలజ, ప్రైవేటు ఉద్యోగిని, ఖుర్దా రోడ్డు

మంచి ఉద్యోగం రావాలని...



నేను బీటెక్ పూర్తి చేశాను. మా ప్రాంతానికి చెందిన కొందరు భక్తులు అప్పన్న గిరి ప్రదక్షిణ చేస్తే మంచి ఉద్యోగం వస్తుందని చెప్పారు. వారి సూచన మేరకు ప్రదక్షిణలో పాల్గొన్నాను. స్వామివారి దయ వల్ల త్వరలోనే నాకు మంచి ఉద్యోగం వస్తుందని ఆశిస్తున్నాను.

- సురేష్, నిరుద్యోగి, అన్నవరం, కాకినాడ జిల్లా

చూడాలన్న ఆసక్తితో వచ్చాను



నాకు యూట్యూబ్ చూడడం ఎక్కువ అలవాటు. ఇటీవల సింహగిరి ప్రదక్షిణ వీడియో చూశాను. మనసులో కోరిక కలిగి వ్యయప్రయాసాలు ఓర్చి ఉత్సవంలో పాల్గొంటున్నాను. ఇంతమంది భక్తులు ఉంటారని ఊహించలేదు. భక్తులందరితో కలిసి గిరి ప్రదక్షిణ చేయడం కొత్త అనుభూతి.

- రేగం శ్రీవల్లి, గృహిణి, విజయనగరం.

మా ఇంటి ఇలవేల్పు



అప్పన్నస్వామి మా ఇంటి ఇలవేల్పు. స్వామిపై భక్తితో గిరిప్రదక్షిణ చేయాలనుకుని నాలుగేళ్ల నుంచి ప్రయత్నిస్తూనే ఉన్నాను. ఇన్నాళ్లకు స్వామి దయ కలగడంతో ఉత్సవంలో పాల్గొనడానికి అవకాశం చిక్కింది. కుటుంబ సభ్యులంతా సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను.

- సీహెచ్ సంఘం, క్షురకుడు, చీపురుపల్లి

స్నేహితుల సూచనలతో వచ్చా..



బీటెక్ పాసై హార్డ్ వేర్ ఉద్యోగం చేస్తున్నాను. అప్పన్నస్వామి దయతో నేను పనిచేస్తున్న ఇదే రంగంలో మరింతగా అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో గిరి ప్రదక్షిణలో పాల్గొన్నాను. నాతో పాటు చాలామంది స్నేహితులు కూడా వచ్చారు.

- ఆర్. కిరణ్, హార్డ్‌వేర్ ఉద్యోగి, కూర్మన్నపాలెం

క్రైం... crime news

అత్తింటి వేధింపులకు మహిళ ఆత్మహత్య

బుచ్చెయ్యపేట, జూలై 20: చోడవరంలో చికిత్స పొందుతూ వడ్డాదికి చెందిన వివాహిత మృతి చెందినట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఈ నెల 18న అత్త మందలించడంతో మనస్తాపానికి గురైన పరిమిల భవానీ (21) క్షణికావేశంతో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో భవానీని కుటుంబ సభ్యులు చోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ భవానీ మృతి చెందింది. బాధితురాలి తల్లి పెదపూడి లక్ష్మి చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

తండ్రీకొడుకుల దాడితో ఒకరికి తీవ్ర గాయాలు

రావికమతం, జూలై 20: వ్యక్తిగత కక్షల నేపథ్యంలో తండ్రీకుమారుడు దాడి చేయడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాల య్యాయి. ఇందుకు సంబంధించి కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తకోట గ్రామానికి చెందిన బాధితుడు వీరవెల్లి గణేష్‌కు అదే గ్రామానికి చెందిన వెల్లంకి త్రిమూర్తుల మధ్య పాత కక్షలు ఉన్నాయి. శనివారం వీరిద్దరూ స్థానిక వెల్లంకి వారి దేవాలయం వద్ద గొడవ పడ్డారు. ఈ క్రమంలో గణేష్‌పై త్రిమూర్తులు ఇనుపరాడ్డుతో దాడి చేసి తలపై గాయపరిచాడు. అనంతరం త్రిమూర్తులు కుమారుడు కూడా వచ్చి దాడి చేయడంతో గణేష్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా విశ్వనాథన్

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.విశ్వనాథన్‌ను వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన విశ్వనాథన్‌ను గత వైసీపీ ప్రభుత్వం జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌గా నియమించింది. ఇదిలావుండగా వీఎంఆర్‌డీఏ కమిషనర్ పోస్టు గత రెండేళ్లుగా ఖాళీగా ఉంది. అప్పటి కలెక్టర్ ఎ.మల్లికార్జునకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన వెళ్లిపోయిన తరువాత జాయింట్ కమిషనర్‌గా ఉన్న రవీంద్రకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు విశ్వనాథన్‌ను పూర్తిస్థాయిలో కమిషనర్‌గా నియమించారు.

కిరండోల్ రైళ్ల గమ్యాల కుదింపు, దారి మళ్లింపు

విశాఖపట్నం, జూలై 20: భారీ వర్షాలు కురుస్తున్నందున విశాఖ, కిరండోల్ మధ్య నడుస్తున్న రైళ్ల గమ్యాలను కుదించడంతోపాటు మళ్లింపు మార్గంలో నడిపించనున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. విశాఖ నుంచి కిరండోల్ వెళ్లే పాసింజర్ రైలు (08551) ఈనెల 20 నుంచి 22 వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్ నుంచి విశాఖ రావాల్సిన పాసింజర్ రైలు ఈనెల 21 నుంచి 23 వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తుందని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేసినట్టు చెప్పారు. ఇక, విశాఖ-కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు (18514) ఈనెల 20 నుంచి 22 వరకు వయా విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా వెళ్తుందన్నారు. తిరిగి కిరండోల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18513) రైలు ఈనెల 21 నుంచి 23 వరకు వయా కోరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా నడపనున్నట్టు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

జలాశయాలు కళ కళ!

- ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు
- పెద్దేరు నుంచి 219 క్యూసెక్కులు విడుదల
- గరిష్ఠ నీటి మట్టాలకు చేరువలో రిజర్వాయర్లు
- ఖరీఫ్ సాగుకు తీరనున్న నీటి కష్టాలు



రావికమతం మండలం కళ్యాణపులోవ జలాశయం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సాగునీరు అందించే జలాశయాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షాలతో జలాశయాలకు జలకళ సంతరించుకుంటోంది. రిజర్వాయర్ల ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఖరీఫ్‌కు సాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఎగువ ప్రాంతాలతో పాటు జిల్లాలో గడిచిన మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జలాశయాల్లోకి భారీగా నీరు చేరుతోందని జల వనరుల శాఖాధికారులు తెలిపారు. వారం రోజుల క్రితం వరకు జిల్లాలో వరుణుడు ముఖం చాటేయడంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు కష్టమేనని అన్నదాతలు ఆందోళన చెందారు. కనీసం వరి నారుమడుల తయారీ కోసమైనా వర్షాలు పడాలని ఆకాశం వైపు ఆశతో చూశారు. అల్పపీడన ప్రభావంతో గడిచిన రెండు, మూడు రోజులుగా జిల్లా అంతటా వర్షాలు కురిశాయి. అలాగే ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో జలాశయాలకు వరద పోటెత్తుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ఆయకట్టుకు విడుదల చేయాల్సిన నీటి నిల్వలతో జలాశయాలు కళకళలాడుతున్నాయి. తాండవ, రైవాడ జలాశయాలకు గతేడాదితో పోల్చి చూస్తే తక్కువ నీటి మట్టం ఉంది. వరహా స్పిల్‌వే నుంచి 100, పెద్దేరు జలాశయం ఉంచి 219 క్యూసెక్కుల నీటిని శనివారం ఉదయం విడుదల చేశారు. శుక్రవారం రాత్రి తాండవ 57 మి.మీ, రైవాడ 56మి.మీ, కోనాం 35మి.మీ, వరహా 18మి.మీ, పెద్దేరు 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారం వద్ద వరహా నది ఉరకలు

ఆశాజనకంగా నీటిమట్టాలు

రిజర్వాయర్ల ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో తాండవ జలాశయానికి 1,273, రైవాడ 810, కోనాం 120, వరహా 100, పెద్దేరుకు 94 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. తాండవ గరిష్ఠ నీటి మట్టం 380 అడుగులు కాగా శనివారం నాటికి 365.40 అడుగులకు చేరింది. రైవాడలో 114 మీటర్లకు 106.65 మీటర్లు, కోనాంలో 101.25 మీటర్లకు 98.45 మీటర్లు, రావికమతం మండలం కల్యాణపులోవ జలాశయానికి శనివారం నాటికి 458.8 అడుగుల నీటి మట్టం చేరింది. మాడుగుల మండలంలో పెద్దేరులో 137 మీటర్లకు 136.2 మీటర్ల ఎత్తుకు నీరు చేరింది. శనివారం 219 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇంకా వరద ప్రభావం ఎక్కువైతే ఆదివారం రెండు గేట్లు ఎత్తేసి సర్పా నదిలోకి నీరు విడుదల చేయనున్నారు. ఎగువ ప్రాంతాల్లో మరో రెండు రోజులు వర్షాలు ఇదేవిధంగా కురిస్తే జలాశయాలు నిండిపోయి, గేట్లు ఎత్తేసే పరిస్థితి ఉంటుందని జల వనరుల శాఖ అధికారులు అంటున్నారు. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలు రైతులకు ఉపశమనం కలిగించింది. ఖరీఫ్ వరి సాగుకు నారు మడులు సిద్ధం చేసుకొనే పనిలో రైతులు సన్నద్ధమవుతున్నారు. కొన్ని మండలాల్లో పొలాల్లోకి పుష్కలంగా వర్షపు నీరు చేరడంతో నాట్లు వేసుకొనేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

దేవీనగర్‌లో నేలకొరిగిన నాలుగు విద్యుత్ స్తంభాలు

కొత్తూరు, జూలై 20: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన కాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ దేవీనగర్‌లో నాలుగు విద్యు త్ స్తంభాలు, కొబ్బరి చెట్టు నేలకొరిగాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పక్కనే ఉన్న స్తంభాలపై కొబ్బరి చెట్టు పడిపోవడంతో వైర్లతో సహా నాలుగు స్తంభాలు నేలకొరిగాయి. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ కారణంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల సరఫరాకు అంతరాయం వాటిల్లిందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ ప్రకాశ్ తెలిపారు. వెంటనే సిబ్బంది అప్రమత్తమై స్తంభాలను సరిచేసి సరఫరాలను పునరుద్ధరించారు.



కరెంటు వైర్లపై పడిన కొబ్బరిచెట్టు

భోగాపురంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల వివరాలపై ఆరా

అచ్యుతాపురం, జూలై 20: మండలంలోని భోగాపురాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలాజీ శనివారం సందర్శించారు. చాలా మంది గ్రామంలో మూత్ర పిండాలు, కీళ్ల నొప్పుల వ్యాధులతో బాధపడుతుండడంతో అక్కడి పరిస్థితులను 'అయ్యో పాపం భోగాపురం' శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై వెనువెంటనే స్పందించిన ఆయన సదరు గ్రామంలో పర్యటించారు. ముందుగా గ్రామ సచివాలయానికి వెళ్లి ఎంత మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారు, తాగు నీరు ఎక్కడ నుంచి వస్తోంది తదితర వివరాలను గ్రామ కార్యదర్శి ద్వారా తెలుసుకున్నారు. ఇటీవల కొన్ని బోర్లలో నీటిని పరీక్షలు చేయగా, ఒక బోరు బావిలో ఫ్లోరైడ్ అధికంగా ఉన్నట్లు రిపోర్టులు వచ్చాయని వివరించారు. ఆ బోరు నీటి వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలని ఆయన ఆదేశించారు. అలాగే గ్రామంలో ఉన్న 12 బోర్లలో నీటితో పాటు ట్యాంకులో ఉన్న నీటిని విశాఖలోని రీజనల్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీకి పంపాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం కిడ్నీ వాధితో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. గ్రామంలో జనాభాకు సరిపడా ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య, సీహెచ్‌ఓ వేణుగోపాల్, జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, దర్మిరెడ్డి నాయుడు బాబుతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌ఓ బాలాజీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



హుకుంపేట మండలంలోని చీడిపుట్టు వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు





పాడేరు ఘాట్ రోడ్డులో భారీగా నిలిచిపోయిన వాహనాలు... (ఇన్‌సెట్‌లో) డైమండ్ పార్క్ సమీపంలో కూలిపోయిన చెట్టు



అరకులోయలో శనివారం హోరున కురుస్తున్న వాన

మన్యం.. అతలాకుతలం

భారీ వర్షాలతో పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు

కొట్టుకుపోయిన కాజ్‌వేలు.. కోతకు గురైన రహదారులు

జల దిగ్బంధంలో గ్రామాలు.. రాకపోకలకు గిరిజనుల పాట్లు

నీట మునిగిన పంట పొలాలు.. లబోదిబోమంటున్న రైతులు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగైదు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు మన్యం అతలాకుతలమైంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు పడిన వానకు అన్ని మండలాల్లోనూ వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. చాలా చోట్ల కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. ప్రధాన రహదారులు కోతకు గురయ్యాయి. పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకుపోయాయి. ఫలితంగా గిరిజనులు, రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

పాడేరు రూరల్/కొయ్యూరు/చింతపల్లి/అరకులోయ/జి.మాడుగుల/ముంచంగిపుట్టు/గూడెంకొత్తవీధి/సీలేరు/హుకుంపేట/పెదబయలు/డుంబ్రిగుడ/ జూలై 20: పాడేరులోని ఇరడాపల్లి పంచాయతీ బొక్కెళ్లు-రాయిగెడ్డ మధ్య మత్స్యగెడ్డ కాజ్‌వేపై వరద నీరు పొంగి ప్రవహించడంతో ఇరడాపల్లి, గొండెలి, కించూరు పంచాయతీలకు చెందిన సుమారు 40 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పాడేరు ఘాట్ రోడ్డులోను, పెద్దపడి డైమండ్ పార్క్‌కు సమీపంలో మలుపు వద్ద భారీ వృక్షాలు కూలిపోవడంతో పాడేరు నుంచి విశాఖ, విశాఖ నుంచి పాడేరు వైపు వచ్చే వాహనాలు భారీగా స్తంభించాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు అగచాట్లు పడ్డారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వృక్షాన్ని తొలగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జి.మాడుగుల మండలంలోని వివిధ పంచాయతీల్లో ఉన్న కోడిమామిడి గెడ్డ, రాళ్లగెడ్డలతో పాటువాగులు పొంగి ప్రవహించడంతో వివిధ పంచాయతీల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. బొయితిలి పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. కుంబిడిసింగి ప్రధాన రహదారిలో రాళ్లగెడ్డ పొంది ప్రవహించడంతో రాకపోకలు నిలిచి పోయాయి. కొత్తపల్లి జలపాతంలో పరవళ్లు తొక్కడంతో పర్యాటకులను అనుమతించలేదు. చింతపల్లి మండలంలో రహదారులు వాగులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, పంట పొలాల్లో వర్షపు నీరు చేరుకున్నది. అన్నవరం గ్రామంలో సరమండ కుమారి, బుడతలవేనం గ్రామంలో కిల్లో అయిత, లంబసింగి గ్రామంలో బోనంగి సత్యవతి ఇళ్ల పైకప్పులు కూలిపోయాయి. కొయ్యూరు మండలం నడింపాలెం పంచాయతీ కంపరేగుల కొండవాగు ఉప్పొంగుతోంది. దీంతో గ్రామానికి చెందిన రత్నం అనే మహిళ నిత్యావసర సరకుల కోసం ప్రాణాలకు తెగించి వాగు దాటి వెళ్లింది. కాకరపాడు-కొయ్యూరు మధ్య కొండవాగులు పొంగి ప్రవహిస్తుండడంతో మండల కేంద్రానికి రాకపోకలు నిలిచాయి. శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద వట్టిగెడ్డ పొంగి రోడ్డుకు అడ్డుగా ప్రవహిస్తుండడంతో కొయ్యూరు వచ్చిన నర్సీపట్నం, పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. అంతాడ-డేకురాయి మధ్య కొండ చరియలు విరిగిపడడంతో పది గ్రామాలకు రవాణా స్తంభించింది. రేవళ్ల గ్రామంలో జన్ని వరహాలమ్మకు చెందిన పెంకుటిల్లు నేలమట్టమైంది. గూడెంకొత్తవీధి మండలంలోని అమ్మవారిధారకొండ మార్గంలో చెలకవీధి సమీప కాలువ వద్ద ఆరు నెలలు క్రితం నిర్మించిన వంతెన కొట్టుకుపోయింది. ఇంజనీరింగ్ అధికారుల, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని గిరిజనులు వాపోయారు. వాగు దాటి వెళ్లేందుకు విద్యార్థులు, గిరిజనులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అలాగే వంచుల పంచాయతీ వీరవరం గ్రామంలో ఓ గిరిజనుడు గృహం దెబ్బతింది. పెదబయలు మండలంలో మత్స్యగడ్డ పరవళ్లు తొక్కుతోంది. జామిగూడ గెడ్డ పొంగడంతో అవతల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పెదకోడపల్లి, కిముడుపల్లి పంచాయితీల్లో రాకపోకలకు అంతరాయం కలిగింది. చాపగడ్డ, మల్లెపుట్టు, గుండలగరువు, నడింవాడ, వనగరాయి మీదుగా నిర్మిస్తున్న రహదారి కోతకు గురైంది. పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగి చెరువును తలపించాయి. అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల పరిధిలో ముసురు వాతావరణం నెలకొంది. ఓవైపు భారీ వర్షం పడడంతో పంట పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. కొత్తభల్లుగుడ, జనంగుడ, కరకవలస, బొండాం నలబుడు, హట్టగుడ, మంజగుడ, డుంబ్రిగుడ మండలం గుంటసీమ పరిధిలోని డోమంగి, పరిడి, జాకరవలస తదితర గ్రామాల్లో వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. వంతెనలపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో గిరిజనులు ఇళ్లకే పరిమితమయ్యారు. వరినాట్లు నీట మునిగిపోయాయి. సీలేరు, ధారకొండ, దుప్పులవాడ అమ్మవారిధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీలో వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని చిన్నఅగ్రహారం గ్రామానికి చెందిన నిండు గర్భిణి కొర్రా లక్ష్మికి పురిటినొప్పులు వస్తున్నాయన్న సమాచారంతో సీలేరు ఆసుపత్రి నుంచి అంబులెన్సును పంపించినప్పటికీ డి.అగ్రహారం వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఏఎన్‌ఎం ఎం అరుణకుమారి, ఆశా కార్యకర్త సుబ్బమ్మ ప్రాణాలకు తెగించి గర్భిణిని వాగులోంచి అంబులెన్సు వరకు నడిపించుకుని తీసుకువచ్చారు. సీలేరులో మసీద్ ప్రహరీ గోడ కూలిపోయింది. హుకుంపేట మండలంలోని చీడిపుట్టు, తడిగిరి వద్ద వంతెనలపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. హుకుంపేట వారపు సంతకు వచ్చిపోయే రైతులు ప్రత్యక్ష నరకం చూశారు. సూకురు, రంగశీల తదితర గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. ముంచంగిపుట్టులో మండలంలోని లక్ష్మీపురం, రంగబయలు, బూసిపుట్టు, బరడ, సంగడ, పనస, దారెల, బంగారుమెట్ట, సుజనకోట, జోలాపుట్టు తదితర పంచాయతీల పరిధిలో మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉరకలేస్తున్నాయి. బిర్రుగూడ సమీపంలో నూతనకంగా నిర్మిస్తున్న కల్వర్టు వరదనీటి ఉధృతికి దెబ్బతినడంతో సుమారు 50 గ్రామాలకుపైగా రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రంలో శనివారం వారపు సంత ఆశించిన స్థాయిలో జరగలేదు. జోలాపుట్టు, సంగడ, పెదబయలు, కుమడ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులు కోతకు గరయ్యాయి. లబ్బూరు, మాకవరం, డోడిపుట్టు, జర్జుల, బాబుసాల, బుంగాపుట్టు, బంగారుమెట్ట, వనభసింగి, పెదగూడ తదితర పంచాయతీల పరిధిలో పంట పొలాలు నీట మునిగిపోయాయి. జర్జుల పంచాయతీ పెద్దతమింగుల గ్రామంలో జి.సీనిగురు ఇంటిపైకప్పు రేకులు ఎగిరిపోయాయి. గోడలు దెబ్బతిన్నాయి.



కొయ్యూరు మండలం కంపరేగుల వద్ద సరకులతోప్రమాదకరంగా వాగు దాటుతున్న రత్నం



కొయ్యూరు మండలలం శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద నిలచిపోయిన బస్సు



గూడెంకొత్తవీధి: చెలకవీధి వద్ద కొట్టుకుపోయిన రహదారి



చింతపల్లి: కోటగున్నలులో రహదారిపై నుంచి ప్రవహిస్తున్న వర్షం నీరు



డొంకరాయి ఏపీపీ డ్యాం నుంచి రెండు గేట్ల ద్వారా వదులుతున్న నీరు

డొంకరాయి నుంచి వెయ్యి క్యూసెక్కుల విడుదల

సీలేరు, జూలై 20: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి అలిమేరువాగు పికప్ డ్యాం (ఏపీపీ డ్యాం)కు వరద నీరు పోటెత్తడంతో శనివారం ఉదయం నుంచి రెండు గేట్లు ఎత్తి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నాలుగు రోజులుగా ఈ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అలమేరు వాగు, పుల్లంగి వాగుల నుంచి వరద నీరు 4 వేలు క్యూసెక్కులు ఏపీపీ డ్యామ్‌లోకి చేరింది. దీంతో డ్యామ్ గరిష్ఠ నీటి మట్టం 940 అడుగులకు చేరుకోవడంతో శనివారం ఉదయం జెన్‌కో అధికారులు అప్రమత్తమై 3 వేల క్యూసెక్కుల నీటిని పవర్ కెనాల్‌లోకి, ఏపీపీ డ్యామ్‌కు చెందిన రెండు గేట్లు ద్వారా దిగువకు మరో వెయ్యి క్యూసెక్కుల నీటని విడుదల చేశారు. ఏపీపీ డ్యాం నీటి మట్టం 939.50 అడుగుల వద్ద నిలికడగా ఉండేలా జెన్‌కో అధికారులు చర్యలు తీసుకున్నారు.

ప్రమాద స్థాయికి డుడుమ జలాశయం

▸▸ బలిమెలకు 1000 క్యూసెక్కులు నీరు విడుదల

ముంచంగిపుట్టు, జూలై 20: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే డుడుమ జలాశయంలో నీటి నిల్వలు ప్రమాద స్థాయికి చేరుకోవడంతో శనివారం వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వర్షాల కారణంగా జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. జలాశయంలో గరిష్ఠ నీటి మట్టం 2,590 అడుగులు కాగా శనివారం 2589.5 అడుగులకు చేరిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో డుడుమ జలాశయం 7వ నంబరు గేటు ఎత్తివేసి బలిమెలకు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డుడుమ జలాశయానికి ఎగువ ప్రాంతంలో ఉన్న జోలాపుట్టు జలాశయంలో 2,750 అడుగులు నీటి నిల్వ ఉండగా ప్రస్తుతం 2,710.45 అడుగులకు చేరింది. ప్రస్తుతం జలవిద్యుత్ కేంద్రంలో రెండు జనరేటర్ల సహాయంతో 45 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.



జి.మాడుగుల బొయితిలి గ్రామంలో నీట మునిగిన పంట పొలాలు



సీలేరు: ప్రసవానికి వెళ్లడానికి డి.అగ్రహారం గెడ్డ దాటుతున్న నిండు గర్భిణి




పెదబయలు మండలంలోని జామిగూడ వద్ద పొంగుతున్న మత్స్యగడ్డ పాయలు



ముంచంగిపుట్టు: డుడుమ నుంచి బలిమెలకు విడుదల చేస్తున్న నీరు

ఉరకలేస్తున్న కటికి జలపాతం

అరకులోయ, జూలై 20: భారీ వర్షాలకు కొండ పైనుంచి పాల ధారలా ఉరకలేస్తూ జాలువారుతున్న కటిక జలపాతం పర్యాటకులను కనువిందుజేస్తోంది. సుమారు 300 అడుగుల ఎత్తు పైనుంచి జలపాతం ప్రవహిస్తోంది. దట్టమైన అడవి మధ్యలో విశాఖ-కిరండోల్ రైల్లో వెళ్లే మార్గంలో బొర్రాకు-కరకవలస రైల్వే స్టేషన్ మధ్య కటికి జలపాతం ఉంది.



జాలువాలుతున్న కటిక జలపాతం

కళకళలాడుతున్న సీలేరు జలపాతం

సీలేరు: సీలేరు జలపాతం (ఐస్‌గెడ్డ) కళకళలాడుతోంది. వారం రోజుల క్రితం వరకు నీరు లేక ఈ జలపాతం కళ తప్పింది. తాజాగా కొండలపై విస్తారంగా వర్షాలు కురవడంతో వంద అడుగుల ఎత్తు నుంచి జలం జాలువారుతూ చూపరులను ఆకట్టుకుంటున్నది.



ఐస్‌గెడ్డ జలపాతానికి జలకళ

వరదలను సమర్థంగా ఎదుర్కోవాలి: కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తన క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లాలోని అధికారులతో శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరదలపై మొదటి హెచ్చరిక రాగానే ఆయా ప్రాంతాల ప్రజలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలను ముందుగానే పునరావసం కల్పించాలన్నారు. అందుకు బోట్లు, ట్రాక్టర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. రేషన్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు ముంపునకు గురయ్యే పరిస్థితులు ఉంటే, సరకులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. జిల్లాలో కల్లేరు, సోకులేరు, అత్తాకోడళ్ల వాగులు పొంగే ప్రమాదముందని, అవి పొంగితే ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాలు సిద్ధం చేసుకోవాలని, ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. పోలీసులు బందోబస్తు విధుల్లో ఉండాలని ఎస్పీని ఆదేశించగా, సెల్ సిగ్నల్స్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సెల్ ఆపరేటర్లను ఆదేశించారు. అలాగే అధికార యంత్రాంగం గత అనుభవాను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా పునరావాసం, సురక్షిత ప్రాంతాలకు తరలింపు వంటి ప్రక్రియలను పక్కాగా చేపట్టాలన్నారు.

ఘాట్ మార్గాల్లో రాత్రుళ్లు రాకపోకలు బంద్

వరదల నేపథ్యంలో జిల్లాలోని ఘాట్ మార్గాల్లో రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్టు కలెక్టర్ దినేశ్ కుమార్ ప్రకటించారు. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ఘాట్ మార్గాల్లో కొండచరియలు, వృక్షాలు పడే ప్రమాదం ఉందని, వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు సాయంత్రం 7 నుంచి ఉదయం 6 గంటల వరకు పాడేరు, అనంతగిరి, చింతూరు, మారేడుమిల్లి, డౌనూరు, కొక్కిరాపల్లి, చింతాలమ్మ ఘాట్ మార్గాల్లో వాహనాల రాకపోకల నిషేధాన్ని అధికారులు పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



డుంబ్రిగుడ ఏకలవ్య పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

క్షయ రహిత జిల్లాకు కృషి చేయాలి

వైద్యారోగ్య శాఖాధికారులు, వైద్యులు జిల్లాను క్షయ రహితం చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచించారు. తన క్యాంప్‌కార్యాలయంలో క్షయ నివారణ పై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలం దగ్గుతో బాధపడే వారికి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతీ పీహెచ్‌సీలోనూ క్షయ నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో జమాల్‌భాషా, జిల్లా క్షయ నివారణాధికారి టి.విశ్వేశ్వరనాయుడు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హేమలత, ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర, వైద్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి

డుంబ్రిగుడ: మండలంలో జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాలను పరిశీలించి, నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించారు. రక్త పరీక్ష కేంద్రం, రోగుల గదులు, జనన నిరీక్షణ కేంద్రాలను పరిశీలించారు. రోగుల గదిలో బెడ్ షీటు లేకపోవడంపై మండిపడ్డారు. జనన నిరీక్షణ కేంద్రంలో గర్భిణులకు పోషకాహర మెనూ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలపై ఆరా తీశారు. విధులు, రికార్డుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నందివలస పాఠశాల సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పీఆర్ డీఈఈ రామం, ఎంపీడీవో జయ ఉమా, ఇంజనీరింగ్ అధికారి అభిషేక్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్షాన్ని సహించం

డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్

కొయ్యూరు, జూలై 20: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్ హెచ్చరించారు. మండలంలోని డౌనూరు సచివాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రేష్మి, వెటర్నటీ అసిస్టెంట్ దైవ రత్నం విధులకు గైర్హాజరైనట్టు గుర్తించారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసి జీతభత్యాలు నిలిపివేయాలని ఎంపీ డీవో సీతయ్యకు ఆదేశించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణ, తాగునీటి వనరులు, రికార్డుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. రహదారి సౌకర్యం లేని పొర్లుబంధ, పాలమామిడి, ముళ్లమెట్ట గ్రామాలలో గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సకాలంలో బర్త్ వెయిటింగ్ హాల్‌కు తరలించాలని చెప్పారు.

సమన్వయంతో పనిచేయండి

చింతపల్లి: సీజనల్ వ్యాధుల నియంత్రణకు క్షేత్ర స్థాయి ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని డీఎల్‌పీవో కుమార్ సూచించారు. చౌడుపల్లి సచివాలయంలో క్షేత్ర స్థాయి ఉద్యోగులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వీటి నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కాలువల్లో నిలువ నీరు ఉండకుండా పూడిక తొలగించాలని, దోమల నివారణ మందు పిచికారీ చేయించాలని చెప్పారు. అనంతరం వామగెడ్డ గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీర సాయిబాబు, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, కార్యదర్శులు కొరుప్రోలు శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, సర్పంచ్ లలిత పాల్గొన్నారు.

భక్త జనసంద్రం

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుచేసిన 80 ఇనుప గడ్డర్లపై భక్తులు లక్షల సంఖ్యలో కొబ్బరికాయలను కొట్టారు. వాటిని పోగుచేసుకునేందుకు కాంట్రాక్టర్ ప్రత్యేక వాహనాలను, పనివార్లను వినియోగించారు. కొంతమంది భక్తులు సింహగిరి ప్రదక్షిణను ముగించుకుని పలువురు భక్తులు రాత్రి తొమ్మిది గంటలకే తిరిగి తొలిపావంచాకు చేరుకున్నారు.

భక్తులకు స్వచ్ఛంద సంస్థల సేవలు

తొలి పావంచా మొదలుకొని పాత అడివివరం, హనుమంతువాక, హెచ్‌బీ కాలనీ మీదుగా గోపాలపట్నం వరకూ భక్తులు నడిచే మార్గాల్లో సేవాసంస్థలు శిబిరాలు ఏర్పాటు చేసి అల్పాహారం, మజ్జిగ, బాదం పాలు, టీ, కాఫీలు, తాగునీరు సరఫరా చేశాయి. అలసిపోయిన భక్తుల కాళ్లకు సత్యసాయి సేవా సంస్థల సిబ్బంది సుమారుగా వంద మంది ప్రత్యేకంగా తయారుచేసిన నూనెతో మర్దనా చేసి సాంత్వన చేకూర్చారు. మానవ సేవే..మాధవ సేవ అనే మాటలను పూర్తిగా విశ్వసించి భక్తులకు సేవలు అందించారు.

పంట నష్టం అంచనాకు శాస్త్రవేత్తల బృందాలు

చింతపల్లి, జూలై 20: పార్వతీపురం మన్యం, ఏఎస్ఆర్ జిల్లాల్లో వర్షాల వల్ల జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు శాస్త్రవేత్తల బృందాలను నియమించినట్టు ఏడీఆర్ అప్పలస్వామి తెలిపారు. శనివారం చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో నష్టం అధికంగా ఉందని, పార్వతీపురం మన్యంలోను పంట నష్టం జరిగిందని చెప్పారు. పార్వతీపురం మన్యానికి ఏడుగురు, ఏఎస్ఆర్ జిల్లాకు ఆరుగురు శాస్త్రవేత్తలను నియమించామన్నారు. ఆది, సోమవారాలు వారు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేస్తారన్నారు. వారి నివేదికలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపు రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలహుసేన్ రెడ్డి పాల్గొన్నారు.

అడ్డుమండ మాజీ సర్పంచ్ మృతి

హుకుంపేట: అడ్డుమండ మాజీ సర్పంచ్ శెట్టి అర్జునుడు (70) మృతి చెందారు. విశాఖలో వైద్య సేవలు పొందుతూ శుక్రవారం మరణించారు. టీడీపీ, నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శనివారం అతని కుటుంబాన్ని పరామర్శించారు.

పొంగుతున్న కొండ గెడ్డలు

... 5వ పేజీ తరువాయి

వాహనాల్లో ప్రయాణికులు నాలుగు గంటల పాటు ఇబ్బందులు పడ్డారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఎక్స్‌క వేటర్‌తో చెట్లను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

బురదలో కూరుకుపోయిన భద్రాచలం బస్సు

భారీ వర్షాలకు శుక్రవారం అర్ధరాత్రి ఆర్వీనగర్ వద్ద భద్రాచలం నుంచి విశాఖపట్నం వెళుతున్న బస్సు బురదలో కూరుకుపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా బయటకు రాకపోవడంతో బస్సును అక్కడే నిలిపివేశారు. దీంతో సుమారు 30 మంది ప్రయాణికులు అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు బస్సులోనే జాగారం చేశారు.

జీసీసీ ఎండీగా కల్పనాకుమారి

... 5వ పేజీ తరువాయి

సీతంపేట ఐటీడీఏ పీవోగా వెళ్లిన ఆమెను కొద్దికాలం క్రితం ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తుండగా, జీసీసీ ఎండీగా నియమించింది. ఆమె భర్త మయూర్ అశోక్ విశాఖ జిల్లా జేసీ పనిచేస్తున్నారు.